

# రచయిత్రి కథ

## శ్రీమతి పరిమళా సోమేశ్వర్

ఆమె మిస్ మాధవి, బి.ఏ.

ఒక సెంట్రల్ గవర్నమెంటు ఆఫీసులో స్టెనోగా పని చేస్తోంది.

ఆమె చదువుకునే రోజుల్లో విద్యార్థులందరి లాగానే వారపత్రికలంటే మహా మోజుగా ఉండే దామెకు. అందులో కొందరు రైటర్సుమీద హీరో (హీరోయిన్) వరషిప్ కూడా పెంచుకుంది.

పత్రికలు అతిగా చదివే వాళ్ళందరి లాగానే ఆమెకి కూడా తనూ ఒక పెద్ద రైటర్నవాలనే కోరిక ప్రబలంగా ఉండేది. మనలో మనమాట—ఒకటి రెండు కథలు వ్రాసి పత్రికలకు పంపటం, అవి ఎక్స్ట్రా స్టాంపులు అతికించకపోయినా సురక్షితంగా తిరిగి ఆమె వద్దకే రావటం కూడా సంభవించింది. ఇంక వ్రాయటానికింక ఎలిజిబిలిటీ రాలేదనుకుని ఆ ప్రయత్నాలను తాత్కాలికంగా విరమించుకుంది.

కాని వ్రాయాలన్న కాంక్ష మాత్రం ఆమెలో బలంగా నాటుకుపోయి ఉంది.

బి. ఏ. ప్యాసయిన తరువాత ఒక్క సంవత్సరంలోనే టైపు, షార్ట్‌హాండ్ లోయరూ, హయ్యరూ కూడా పాసయి వెంటనే ఉద్యోగంలో చేరింది మాధవి.

వయసు, జీవితానుభవం పెరగటంతో ఆమె మేధస్సు కూడా వికసించింది. సహజంగా ఆమెలో రచనాశక్తి ఉండటం వలన తన మేధస్సులో జనించే భావాలకు ఒక స్పష్టమయిన రూపాన్నికూడా యివ్వ గలుగుతోంది. దానికి తోడు విద్యార్థి దశలోలా ఉద్యోగంలోకి చేరిన తరువాత యింటికి వచ్చికూడా చదువవలసినవి కాని, వ్రాయవలసిన విషయాలు కాని ఏమీ లేనందున చాలినంత టైము లభించటంతో ఆమె నాలుగైదు రచనలు చెయ్యగలిగింది. అందులో తనకి బాగా నచ్చిన కథనొకదానిని నాలుగైదు సార్లు దిద్ది నీటుగా ఫెయిర్‌కాపీచేసి తనకిష్టమైన 'ప్రగతి' సచిత్ర వారపత్రికకు పంపింది మాధవి.

ఆ కథ పంపిన నెలరోజుల వరకు తన కథ అచ్చవు తుందా లేదా అన్న ఆరాటంతోనే గడిపింది. ప్రతి వారం పత్రిక రాగానే విషయ సూచికలో తన కథ పేరుందో లేదో చూసి నిరుత్సాహపడటం జరిగేది. తరువాత క్రమంగా ఆ విషయాన్ని కూడా మర్చి పోసాగింది.

ఒకరోజు సాయంత్రం ఆఫీసు నుండి యింటికి వచ్చేసరికి ఆమె తమ్ముడు పరుగెత్తుకుంటూ ఎదు రొచ్చి చెప్పేడు "అక్కా! నీ కథ పడిందే పత్రి కలో" అంటూ. మొదట అర్థం కాలేదామెకు.

"ఏం కథరా?" అనడిగింది.

"అదేనే రెండునెల్ల క్రితం నన్ను పోస్టు చెయ్య మని యిచ్చేవే "స్టెనోగర్ల్" అన్న కథ. అది 'ప్రగతి'లో అచ్చయింది."

అప్పటికి అర్థమయింది సంగతంతా.

"ఏదీ పత్రిక చూపించు" అంటూ లోపలికి పరుగెత్తింది మాధవి.

టేబుల్ మీద పడి ఉన్న 'ప్రగతి' తీసి విష సూచిక చూసింది. అందులో 'స్టెనోగర్ల్' పద్దెని మిదవ పేజీలో ఉన్నట్లు తెలుసుకుని గబగబ పేజీలు తిరగవేసింది.

అవును. తను వ్రాసిన కథే అది!

పై పక్కా స్పష్టంగా తనపేరు కనిపిస్తున్నా, యిది కలా, నిజమా అన్న సంశయం కలిగిపోయిందామెకు. ఓసారి ఆదరాబాదరా కథంతా చదివింది. అవును. స్వయంగా తన చేత్తో వ్రాసిన కథే!

ఆమె ఆనందానికి అవధులు లేవు. మరల మరల అచ్చులో ఉన్న తన పేరును తనివితీరా చూసుకుంది. ఆమె వాస్తవిక ప్రపంచంలోకి తిరిగి రావటానికి కనీసం గంటయినా పట్టి ఉంటుంది. మొదటి రచన అచ్చయినపుడు కలిగే ఆ ఆనందం ఆ రచయితకే అర్థం అవుతుంది.

తన చిరకాల వాంఛితం యీడేరటంతో, ఎప్పుడూ తను చదివి ఆనందించే పుస్తకంలో తన పేరు కూడా ఉండటంతో తన జీవితంలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమయిందనుకుంది మాధవి.

కాని చిన్ననాటి కల యీ రూపంలో ఎప్పుడైతే నెరవేరిందో ఆమె జీవితంలో అప్పుడే 'ట్రాజిక్ ఎలిమెంట్సు' కూడా ప్రవేశించసాగినయ్.

మర్నాడు ఆదివారం అవటం వలన ఆఫీసుకు

[illegible] యింట్లోనే ఉండిపోయింది మాధవి. ఆ రోజల్లా కూర్చుని కనీసం పన్నెండు సార్లన్నా చదివింది తన కథను. చివరికి సాయంత్రం అయేసరికి ఆ కథ సంగతి మాసిపోయింది. ఎప్పుడు తెల్లవారుతుందా, ఆఫీసు వాళ్ళు తన కథను గురించి ఏం వ్యాఖ్యానిస్తారా అని ఉందామెకు. తెల్లవారింది.

ఈరోజు మాధవిలో నిన్నటి ఉత్సాహోద్రేకాలు లేవు కాని ఆఫీసులో అడుగు పెడుతుంటే అంతకు ముందులేని ఆత్మవిశ్వాసం, ఒకరకమైన ఠీవి కనబడ్డాయి ఆమె నడకలో.

ఆఫీసుకు వెళ్ళగానే తన కొలీగ్—కమల తనని కంగ్రాట్యులేట్ చేస్తుందనుకున్న మాధవికి ఆశాభంగమే కలిగింది.

కమలా వాళ్ళ యింట్లో 'ప్రగతి' పత్రిక కొంటారు. అందులో ప్రచురితమయ్యే ప్రతి కథనూ వదల్లా పోకుండా చదువుతుంది కమల. మరి తన కథను గురించి ఏం మాట్లాడదే? అసలు తన కథ చదివిందో లేదో! చదివినా తను వ్రాసిందో కాదోనని వూరుకుందా! తను యింటి పేరుతో సహా వ్రాసిందే తన పేరును. పైగా తను అప్పుడప్పుడు ఏవో వ్రాస్తుంటానని ఆమెకు తెలుసు. సహజంగా ఇలాటప్పుడు ఎవ్వరైనా "ఇలాగా కథ వ్రాసింది మీరేనా?" అనడుగుతారు. మరి కమల ఏం అడగలేదెందుచేత? తనంతట తాను "నా కథ చదివేవా?" అనడిగితే బాగుండదు. ఇప్పుడెలా? అని ఆలోచిస్తోంది మాధవి. పైగా ఎప్పుడూ నవ్వుతూ తనతో సర్దాగా మాట్లాడే కమల యీరోజు అదోలా కంగా ముభావంగా ఉంది. ఏమయింది కమలకీ రోజు?

మాధవి కేమీ అర్థం కాలేదు.

చివరకు తన సీట్లో కూర్చుని వర్కు చేసికో సాగింది. అరగంట గడిచింది.

జనరల్ సెక్షన్ నుండి మోహనరావు వచ్చేడక్కడికి. వస్తూనే మాధవిని చూసి "ఏమండీ, ఈ వారం 'ప్రగతి' పత్రికలో "స్టెనోగర్ల్" అన్న కథ వ్రాసింది మీరేనా?" అనడిగేడు.

మోహనరావు మాధవికి కొంచెం దూరపు బంధువు. అందుచేత అతనికి మాధవి యింటి పేరు కూడా తెలుసు.

"అవునండీ" అని సమాధానమిచ్చింది మాధవి కొంచెం సిగ్గుపడుతూ.

మాధవి సెక్షన్‌లోని కొలీగ్సంతా ఆమె వంక వింతగా చూసేరు. అందులో ఒకతను "మీరు కథలు వ్రాస్తారాండీ? ఇంతవరకు ఎప్పుడూ చెప్పలేదే? ఇదివరకు ఏమేం కథలు అచ్చయినయ్?" అనడిగేడు.

"అచ్చయిన నా మొదటి కథ యిదేనండి" అంది మాధవి. ఆమెకు ఒకరకంగా లోలోపల సంతోషంగా ఉన్నా అందరి దృష్టులు తన మీదే ఉండటంతో ఇబ్బందిగా ఫీలవ సాగింది.

ఆమె కమల వంక చూసింది.

కమల తమ సంభాషణ విన్నట్లు స్పష్టంగానే తెలుస్తోంది. ఐనా ఆమె ఎలాటి ఆసక్తినీ కనపర్చకుండా తన పని చేసుకుపోతుంటే ఆశ్చర్యపోయింది మాధవి.

చివరికి ఆనోటా యీనోటా మాధవి కథ సంగతి ఆఫీసంతా ప్రాకిపోయింది సాయంత్రం అయేసరికి.

మధ్యాహ్నం రెండుగంటల వేళ రోజులాగానే ఒక రూములో కూర్చుని ఆ ఆఫీసులో ఉన్న ముగ్గురు లేడీస్ లంచ్ తీసుకుంటున్నారు.

మూడవ ఆమె—ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షన్‌లో పని చేస్తున్న నీరజ అంది "కంగ్రాట్యులేషన్స్ మాధవీ! నీ స్టోరీ చూసేను. మన ఆఫీసు వాతావరణం అంతా ఉన్నదున్నట్లు దించేసేవే. ఈ కథ చదివిన ఎవరికైనా నువ్వు ఆఫీసులో పని చేస్తున్నట్లు తెలుస్తుంది. చాలా న్యాచురల్‌గా ఉంది స్టోరీ" అంది.

నీరజ చెప్పిన పద్ధతి మాధవి కెందుకో నచ్చలేదు. ఏదో అందామనుకుంది కాని వెంటనే నోరు కట్టేసుకుంది. లంచ్ తీసుకోగానే అర్జెంటు పనుందంటూ నీరజ రోజూ కంటె ముందుగా వెళ్ళిపోయింది.

కమల, మాధవి మిగిలేరు.

వాళ్ళిద్దరూ తమ రూమ్‌కి తిరిగి వస్తుంటే దారిలో అంది కమల. "చూడు మాధవీ నీకు కోపం రాకుండా ఉంటే ఒకటి చెప్పాలనుంది" అని.

ఉదయం నుండి కమల మౌనాన్ని చూసిన మాధవికి యిలాటి సందర్భం ఏదో వస్తుందని ముందే తోచింది.

"ఏమిటది అడుగు. నేనేమీ అనుకోను" అంది.

కాసేపాగి చెప్పసాగింది కమల.

"చూడు. నువ్వు వ్రాసిన కథలోని కథానాయకురాలు ఒక స్టెనో. ఆమెను ఎంతో సంస్కారవంతురాలిలా చిత్రించేవు. అంతవరకు బాగానే ఉంది. ఆ అమ్మాయి కొలీగ్ శారద పట్టి లైట్‌హార్టెడ్ మనిషనీ, అర్థమైన వాళ్ళతోనూ చనువుగా తిరుగుతుందనీ ఆమె కారక్టర్ కూడా అంత మంచిది కాదనీ వ్రాసేవు. ఇండైరెక్టుగా అది నన్నవమానించటం కాదూ?"

మాధవి విస్తుపోయింది.

"అందులో నిన్ను ఇన్సల్టు చెయ్యటమేమిటి కమలా! నాకేం అర్థం కావటంలేదు" అంది.

"నువ్వు వ్రాసిన కథలో మన ఆఫీసు వాతావరణాన్ని ఉన్నదున్నట్లు దించేవు. అందులోని కథానాయకురాలు కూడా నీలానే స్టెనో. సాధారణంగా రచయితల నాయికానాయకుల పాత్రలలో తమని తాము చిత్రించుకుంటారనే అభిప్రాయం ఉంది.

నేను నీలా రిజర్వ్‌డుగా ఉండను. నలుగురితో సోషల్‌గా మాట్లాడినంతమాత్రాన ఆడదానికి కారక్టర్ లేనట్లేనా? స్త్రీవై ఉండీ అందునా రచయిత్రివయి ఉండీ తోటి స్త్రీని యింతేనా అర్థం చేసికోగలిగింది? మన ఆఫీసులో నీ కథ చదివిన వాళ్ళకెవరికయినా అందులోని కథానాయకురాలివి నువ్వేనని తోస్తుంది. అలాటప్పుడు నువ్వు చిత్రించిన శారద పాత్ర నన్నే చూసి వ్రాసేవని వారనుకుంటే అందులో ఆశ్చర్యం ఏమీ లేదు" అన్నది కమల ఆవేశంగా.

"క్షమించు కమలా! నిన్నే శారదగా చిత్రించేననుకుంటే నువ్వు పొరపడ్డావనే చెప్తున్నా. ఏదో కథ కోసం అవసరం వచ్చి అలాటి పాత్రను సృష్టించవలసి వచ్చింది కాని నిన్ను దృష్టిలో ఉంచుకుని కాదు నేను వ్రాసింది. నాకు బాగా పరిచయమున్నదవటం వల్ల మన ఆఫీసు వాతావరణాన్ని నా కథకు బ్యాక్‌గ్రౌండుగా తీసుకున్నాను. అంతే తప్ప అందులోని కథానాయకురాలు గీత నేనూ కాదు, శారదవు నువ్వూ కాదు" అంది మాధవి.

"ఏమో. చదివే వాళ్ళందరికీ ఆ సంగతులేం తెలుస్తాయ్! మనల్నిద్దరినీ తెలిసిన వాళ్ళెవరయినా నన్ను చూసే శారద పాత్రని చిత్రించేవనుకుంటారు" అంది అప్పటికీ యింకా ప్రసన్నురాలు కాని కమల. మాధవి నిట్టూర్చి వూరుకున్నది చేసేదేం లేక.

ఆఫీసులోకి వెళ్ళి తన సీట్లో కూర్చున్న మాధవి తన కథని గురించి ఆలోచించటం మొదలెట్టింది. ఒక ఆఫీసులో గీత, శారద అనే యిద్దరమ్మాయిలు పని చేస్తుంటారు. అందులో గీత ఉన్నతమైన వ్యక్తిత్వం, నిర్దుష్టమైన శీలం గలదైతే శారద స్వభావం దానికి పూర్తి వ్యతిరేకం.

ఆఫీసులో పనిచేసే మగవాళ్ళందరితోనూ చాలా ఫ్రీగా తిరుగుతుంది శారద. ఆమె కెటువంటి పట్టింపులూ లేవు. 'బాస్' తో సాయంత్రం పబ్లిక్ గార్డెన్సు పోవటాని కూడా ఏం అభ్యంతరం లేదామెకు. అలాటి అవకాశాలను ఎన్నో ఉపయోగించుకున్న బాస్ స్త్రీలందరూ శారద లాగానే ఉంటారన్న అపోహలో పడి గీతని కూడా అదేవిధంగా 'డీల్' చెయ్యబోతాడు. కాలిజోడు తీసి ఎందుకు లెమ్మని మరల పెట్టేసుకుని అంతకంటె గట్టి మాటలతో బుద్ధి చెప్పి బాస్‌కి కనువిప్పు కలిగిస్తుంది గీత. ఇదీ కథ.

దీన్ని చూసి కమల కోపం తెచ్చుకుందంటే దానికి తనెంత వరకు బాధ్యురాలో తెలియటం లేదామెకు.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళి తన సీట్లో కూర్చోగానే ప్యూను వచ్చి చెప్పేడు "అయ్యగారు రమ్మంటున్నారు" అని.

మాధవి నోట్ బుక్కూ పెన్సిలు పట్టుకుని లోపలికి నడిచింది. విష్ చేయగానే ఎప్పటిలా బాస్ "కూర్చో" మని సీటు ఆఫర్ చెయ్యనందున నిలబడే ఉంది మాధవి పెన్సిల్ రెడీగా పట్టుకుని.

ఎంత సేపటికీ ఎలాటి వాక్యాలు వినరాక పోయేసరికి తలెత్తి బాస్ వంక చూసింది.

ఆయన ముఖం ధుమధుమలాడుతుంది.

ఉపోద్ఘాతం లేకుండానే మొదలెట్టేడు బాస్. "చూడు మిస్ మాధవీ! నువ్వు రైటరువని విని చాలా సంతోషించేను. కాని నీ చుట్టూ ఉన్న మనుష్యులను హీనంగా చిత్రించి లోకానికి వెల్లడి చెయ్యటమే నీ రచనల ధ్యేయమైతే దానివల్ల చాలా అనర్థాలు కలగవచ్చు. ఏమంటావ్?" అన్నారు ఆమె వంక చూస్తూ.

"ఎక్స్‌క్యూజ్‌మీ" అని వూరుకుంది మాధవి ఏమనాలో తోచక.

"నీ కథలో మన ఆఫీసు వాతావరణమంతా ఉన్నదున్నట్లు సృష్టించేవ్. అందులోని కథానాయకురాలివి నువ్వేనని ఎవరికైనా యిట్టే తెలిసిపోతుంది. బాస్ లంతా స్త్రీలోలురైనట్లు ఆఫీసుల్లో పనిచేసే స్త్రీలు తమ పాతివ్రత్యాన్ని నిలబెట్టుకొంటానికి కాలిజోళ్ళను కూడా ఉపయోగించవలసినంత ఖర్మ పట్టినట్లు వ్రాసేవు. ఇదంతా చదివితే జనం ఏమనుకుంటారు? నేను మీ సెక్షన్ హెడ్‌నని తెలిసిన ప్రజలు నన్ను గురించి ఎంత నీచంగా ఆలోచిస్తారో గ్రహించేవా? నీలోని రచనాశక్తి నుపయోగించుకోవలసిన మార్గ మిదేనా?" అని అడుగుతుంటే మాధవికి కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది.

"క్షమించండి బాస్. నన్ను అపార్థం చేసికొంటున్నారు. మీరూహించుకునే ఉద్దేశ్యాలేమీ పెట్టుకుని

# రచయిత్రి కథ

వ్రాయలేదు నేనా కథను. అంతకంటె యింక మీకేమీ వివరించలేను'' అంటూ బయటకు వచ్చేసింది.

మొన్నటి ఉత్సాహం నిన్నటి కమల అభియోగంతో చప్పగా చల్లారిపోతే యీనాటి బాస్ ఆవేశం తనని నిలువునా కుంగదీసింది. ''ఏమిటిది? ఏమవుతోంది తనకి? కథ యిలా అడ్డం తిరిగిందేమిటి?'' అని ఆలోచిస్తూ తలపట్టుకు కూర్చుండిపోయిందిమాధవి.

ఆ రోజు సాయంత్రం యింటికి వెళ్లేసరికి యిల్లంతా పిల్లలతో సందడిగా ఉంది. ఏమిటూ అని ఆశ్చర్యపోతుంటే ''పిన్ని'' అంటూ వాటేసుకున్నారామెను పిల్లలు. పెద్దక్క పద్మజ బెజవాడ నుండి వచ్చిందని తెలుసుకుంది మాధవి.

రెండు సంవత్సరాల తరువాత పెద్దక్కను ఆమె పిల్లలను చూస్తున్నందుక సంతోషం వేసిందామెకు. ఆమెను చూడగానే పద్మజ ''రచయిత్రిగారు వచ్చేరే'' అంది హాస్యంగా.

మాధవి నవ్వి వూరుకుంది.

రాత్రి భోజనాలయినాక వెన్నెట్లో మంచా లేసుకుని కబుర్లు చెప్పుకుంటున్నారు అక్కా చెల్లెళ్లు. పిల్లలంతా నిద్రపోతున్నారు.

ఉన్నట్లుండి పద్మజ అటూ యిటూ చూసి మెల్లగా అంది ''ఏమే మాధవీ! వాడు నిజంగా నీచెయ్యి పట్టుకున్నాడటే'' అని.

అసందర్భంగా ఉన్న ఆ ప్రశ్నకు తెల్లబోయింది మాధవి.

''ఎవరక్కా వాడు? నా చెయ్యి పట్టుకోవట మేమిటి?'' అంది.

''అదేనే. నువ్వు కథలో వ్రాయలేదూ? అందులో నీలాటమ్మాయిని గురించేగా నువ్వు వ్రాసింది. నిజంగానే మీ బాస్ నీ చెయ్యి పట్టుకున్నాడటే? బాగానే బుద్ధి చెప్పేవులే వెధవకి'' అంది పద్మజ.

ఆ స్థితిలో కోపం కన్న ఎక్కువగా జాలేవేసింది అక్కను చూస్తుంటే మాధవికి. ''ఛ! అదేమిటక్కా అలాగంటావ్? అది వట్టి కథేనే! ఖర్మ వశాత్తు అందులోని కథానాయకి కూడా నాలాగానే స్టెనో అయినంతమాత్రాన అది నా కథే అయినట్టా? ఛీఛీ! బాస్ నా చెయ్యి పట్టుకోవట మేమిటే అసహ్యంగా! కథ అంటే వట్టి కల్పనే అని తెలియదూ నీకు?'' అంది.

''ఏమోనే. నాకు మాత్రం ఏం తెలుసూ, కథంతా ఆఫీసులో జరిగినట్లు వర్ణించి ఆ అమ్మాయి కూడా స్టెనోనే అని వ్రాస్తే అది నీ కథేనను కున్నాను'' అంది సాగదీస్తూ పద్మజ.

''హే భగవాన్!'' అనుకుంది కళ్లు రెండూ గట్టిగా మూసుకుని మాధవి.

వారంరోజుల్లో ప్రగతి పత్రికవారు ఆమె కథ అచ్చయిన పత్రికతోపాటు పారితోషికం పంపుతూ ఆమె కథలోని శైలి, భాష అన్ని చక్కగా ఉన్నాయనీ, యింకా కొన్నిరచనలు చేసి పంపుతూండమనీ ప్రోత్సాహకరంగా వ్రాసేరు.

దాంతో మాధవికి ఎక్కడలేని ఉత్సాహం కలిగింది. మొదటి కథ అచ్చయిన తరువాత కలిగిన అనుభవాలతో తల బొప్పి కట్టిన మాధవి యీసారి వ్రాసే రచనలలో తన ఆఫీసు వాతావరణం కాని, తనకి సంబంధించిన వ్యక్తులను గురించి కాని, స్థలాలను గురించికాని ప్రస్తావన రాకుండా చాలా జాగ్రత్త పడసాగింది.

మాధవి కథలు ఏ ఐదారు అచ్చయేసరికి ఆమె వివాహం కూడా అయింది.

మిస్ మాధవి అల్లా మిసెస్ మాధవీ శేఖర్‌గా మారిపోయింది.

అత్తగారింటికి వెళ్లాక రెండుమూడు నెలల వరకు ఏం వ్రాయలేదు మాధవి. కొత్త వాతావరణంలో యిమడటాని కనుకూలంగా తనని తాను తయారు చేసికోవటంతోనే గడచింది కాలం.

తరువాత ఆమె మరల రచనలు చెయ్యాలని సంకల్పించుకుంది.

గృహిణిగా మారిన మాధవి ఆలోచనలలో జీవితాన్ని చూసిన ఆమె దృక్పథంలో కూడా మార్పులు వచ్చినయ్. ఈ మార్పులు ఆమె రచనలలో కూడా తమ ప్రభావాన్ని చూపసాగినయ్.

ఒక రచయిత ఎప్పుడూ తన చుట్టూ ఉన్న పరిసరాలని ఆధారంగా తీసుకుని కథాచిత్రం చెయ్యటం సహజం. కథావస్తువు ఏమయినా అతడు తనకి పరిచయమైన ఆ పరిసరాల ప్రభావాన్నుండి మాత్రం తప్పించుకోలేడు.

అందుకే కొత్తగా గృహిణి అయిన మాధవి సామాన్య మధ్యతరగతి కుటుంబాన్ని చిత్రిస్తూ అందులో చదువు సంస్కారం గల ఒక యువతికీ అజ్ఞానురాలైన ఆమె అత్తగారికీ మధ్య జరిగే సంఘర్షణని గురించి వ్రాసింది ఒక కథలో.

ఆ కథ అచ్చయిన తరువాత దానిని చదివిన అత్తగారు వనజాక్షమ్మ ముఖం చిన్నబుచ్చుకుంది.

అత్తగారి ముఖంలోని భావాలను చదివిన మాధవి నాలుక కొరుక్కుంది.

చదవటం పూర్తి చేశాక వనజాక్షమ్మ కళ్ల జోడు తీసి కోడలి వంక చూసింది.

''ఏమ్మా మాధవీ. నేను నీతో ఎన్నడైనా అంత మూర్ఖంగా ప్రవర్తించేనా?'' అనడిగింది.

మాధవి తలవంచుకుంది.

ఆమెకు తన మొదటి కథ తాలూకు అనుభవాలన్నీ జ్ఞప్తికి రాసాగినయ్.

''చూడు మాధవీ ఒక తరానికీ మరో తరానికీ అభిప్రాయాల్లో అభిరుచులలో భేదం ఉండటం సహజం. అలాటప్పుడు ఒకరి అభిప్రాయాలను మరొకరు అర్థం చేసికొని మన్నించటంతోనే రెండు తరాల మధ్య శాంతియుత సహజీవనం సాధ్యమవుతుంది. అంతేకాని ఒకరి నొకరు ద్వేషించుకుంటూ వారేదో తమకి సహజ శత్రువుగా భావించటంలో అర్థంలేదు. మూడునెలలుగా కలసి ఉండి నువ్వు నన్నర్థం చేసికోగలిగింది యింతేనా? నాలో అజ్ఞానం మూర్ఖత్వంతప్ప మరేంకనపడలేదానీకు? 'అనడిగింది.

మెల్లగా సమాధాన మిచ్చింది మాధవి ''అది కాదండీ అత్తయ్యా! నేను సాధారణ కుటుంబాల్లో బాగా చదువుకున్న కోడలు అతి పురాతన భావాలు కల అత్తగారూ ఉంటే ఎలాటి సమస్యలొస్తాయో వ్రాసేనంతే. అంతమాత్రంచేత అత్తగార్లంతా నా కథలోలా మూర్ఖంగా ఉంటారనీ, చదువుకున్న కోడళ్లంతా మంచిగా ఉంటారనీ కాదు నా అభిప్రాయం. అదటుంచి అసలు కథల్లోని పాత్రలతో మనల్ని పోల్చుకోవటం ఎందుకండీ? మీరెన్నడూ ఆ కథలోని అత్తగారిలా మూర్ఖంగా ప్రవర్తించలేదే. పైగా మనిద్దరి మధ్యా ఏనాడూ మనస్పర్థలు గాని వాగ్వివాదాలు కాని జరగలేదు. ఏదో లోకసహజమైన విషయాన్ని వ్రాస్తే అది మనకు కూడా వర్తిస్తుందనుకోవటం పొరపాటు.'

''ఏమో. కాని చూసేవాళ్లే మనుకుంటారు? అత్తగారు ఆమె నెంతో రాచ్చపెట్టి ఉంటుంది. అందుకే స్వానుభవంతో ఆమె యిలాటి కథ వ్రాసిందనీ అనుకోరూ మరి జనం?'' అంది లేచి వెళ్లి పోతూ వనజాక్షమ్మ.

మాధవి నీరసంగా కూలబడింది కుర్చీలో.

రాత్రి భర్తతో చెప్పింది విషయం.

అతను కూడా ఆ కథ చదివి ''అవును. అమ్మ కోపం తెచ్చుకోవటంలో ఆశ్చర్యంలేదు. తన కోడలు యిలాటి కథ వ్రాసిందంటే ఏ అత్తకయినా


దగ్గు నివారిణి: తిరగబెట్టకుండా దగ్గును యిప్పుడే నిర్మూలించండి.ఖరీదు రు.157-15 ట్రయల్ రు 12-13 పై.

చెవుడు: పూర్తికోర్సుద్వారా చెవుడు పూర్తిగా నయమగును. పూర్తి కోర్సు రు. 147-15. ట్రయల్ రు. 17-97 పై.


కంటిలోని పొర. పక్వమైనా, కాకపోయినా ఆపరేషన్ లేకుండా రు. 87-97 పైసలకు తప్పక నయం చేయబడును.

జాబులు ఇంగ్లీషులో వ్రాయండి.

DR. SHERMAN, F C. S.

181, ०. N .Guha Road, Calcutta-28

అద్భుత వినోద సాధనము




ఏసి/డిసి ఎలెక్ట్రిసిటీ లేక బ్యాటరీతో సాహస ప్రేమ, హాస్యం,పోట్లాటలు,వారల కార్టూన్లు,స్లయిడ్లలో, మీ అభిమాన నటీనటులు తమంతటతామే సజీవంగా కదలుచూ, నాట్యంచేయు సన్నివేశాలు సినిమాలో వలెనే ఇంటియందు చూడవచ్చును. సంతలు, ప్రదర్శనములందు సినిమా ప్రారంభించి డబ్బు సంపాదించండి. మీ తృప్తికి మా పూచీ. సరికొత్త శ్రేష్ఠమైన-ఎక్కువ అమ్మబడుతున్నది.సూపర్ స్పెషల్ ప్రొజెక్టర్ రు. 45/- 100 అ. ఫిల్మ్,6' × 5' స్క్రీన్, సలహాలు, ఫిలిం లిస్టు ఉచితం. పోస్టేజి రు. 5/-డీలక్స్ స్పెషల్ రు.25/-20 అ ఫిలిం, 2' × 1' స్క్రీన్ ఉచితం. పోస్టేజి రు 5/- ఫిలిం అదన ఖర్చులు లేక మార్చుకొన వచ్చును. కొద్ది స్టాకే గలదు. త్వరపడ, నేడే మీ ఆర్డరు పంపండి.

Hollywood Cinema Corpn.(Regd)
(AP) Kalyanpura, Delhi-6.

Pratap/HCC/18267

వస్తుంది కోపం" అన్నాడు. మాధవి నిస్సహాయంగా భర్త వంక చూస్తూ కూర్చుండిపోయింది.

తన తల్లి అమాయకత్వానికి నవ్వుకుని తల్లికి నచ్చచెప్పి తనని ప్రోత్సాహిస్తాడని భావించిన భర్త యిలా మాట్లాడటంతో నీరు గారిపోయింది మాధవి.

"పత్రికలకు వ్రాస్తుంటావేమిటి? ఇదివరకేమైనా వ్రాసేవా? ఇదే మొదటి సారా?" అనడిగేడు భర్త.

"పెళ్లి కాకముందు కూడా నాలుగైదు కథలు అచ్చయినయ్. పెళ్లయినాక వ్రాసిన మొదటి కథ యిదే. వాటిని కూడా చదువుతారా?" అనడిగింది మాధవి.

ఈ మూడునెలలుగా అతని కెప్పుడూ తన రచనలను గురించి చెప్పే అవకాశం కలగలేదామెకు. ఇంకా కొత్త పూర్తిగా పోనందున ఉనంతట తాను ప్రస్తావించి చెప్పటానికి సంకోచపడిందిన్నాళ్లూను.

"రేపు ఆదివారంనాడు చూపించు. తీరిగ్గా చదువుతాను." అన్నాడు శేఖర్ ఆవలిస్తూ.

ఆదివారం మధ్యాహ్నం భోజనాలయినాక తన కథలు అచ్చయిన పత్రికలు తెచ్చి భర్త ముందు పడేసి అప్పడాలు వత్తటంలో అత్తగారికి సాయం చేయటానికని లోపలికి వెళ్లింది మాధవి.

అప్పడాల పనయ్యేసరికి రెండుగంటలు పట్టింది. అప్పుడు లేచి ఉప్మా, కాఫీ చేసి భర్త గదిలోకి తీసుకు వెళ్లింది.

ఆమె వెళ్లేసరికి అతను మంచం మీద పడుకుని ఉన్నాడు ఏదో ఆలోచిస్తూ.

"చదివేరా కథలు?" అనడిగింది భర్తను నవ్వు ముఖంతో.

"ఆ చదివేను" అన్నాడు క్లుప్తంగా శేఖర్.

తలవంచుకుని టేబులు మీద టిఫిను ప్లేట్లు, కాఫీ కప్పులు పెడుతున్న మాధవి భర్త ముఖంలోని భావాలు చూడలేకపోయింది.

మౌనంగా టిఫిను తిని కాఫీ తాగేరిద్దరూ.

భర్త తన కథలను గురించి ప్రస్తావిస్తాడేమోనని చూసింది మాధవి. కాని అతనేం ఆ ప్రసక్తి ఎత్తలేదు.

చివరికి ఉండబట్టలేక ఆమె అడిగింది "ఏమండీ, ఎలా ఉన్నయ్ కథలు?" అని.

"బాగానే ఉన్నయ్!" భర్త ముఖంలోకి చూసిన మాధవి అదిరి పడ్డది.

"అదేం? అంత ముభావంగా ఉన్నారు? మీకు నా కథలు నచ్చలేదు కదూ?" నవ్వు తెచ్చుకుంటూ అన్నది.

"నచ్చటం, నచ్చకపోవటం కాదు ప్రశ్న." అంటూ ఆగిపోయేడు శేఖర్.

"మరేమిటండీ. ఎందుకలా ఉన్నారు?" అనడిగింది ఆత్రంగా మాధవి.

క్షణంసేపు వూరుకుని యిక ఆపుకోలేనన్నట్టు మొదలు పెట్టేడు శేఖర్ "ఏమిటో మాధవీ. ఆ కథలు కథలుగా చదివితే బాగానే ఉన్నయ్. కాని వీటిని నువ్వు వ్రాసేవనుకుంటేనే నా మనసదోలా అయిపోతోంది. నీ ప్రతి కథలోనూ పురుష పాత్రలను కూడా స్త్రీ పాత్రల్లానే ఎంతో నిశితంగా వర్ణించేవు. ఒక పాఠకుడిగా చదివి నిన్ను ఎప్రిసియేట్ చెయ్యగలిగే వాడినేమో. కాని నీ కలం నుండి అలాటి పాత్రలు వచ్చేయనుకుంటే నా హృదయం దహించుకుపోతోంది. అవివాహితురాలైన ఒక యువతి, పురుష పాత్రలను అన్నికోణాల్లో చిత్రించ గలిగిందంటే ఏమనుకోవాలి? నీకు కనీసం అన్నయ్యలు కూడా లేరు కదా. అలాటిది ఒక యువకుడి అలవాట్లు, అభిరుచులు యివన్నీ ఎలా చదవగలిగేవు? అదంతా వట్టి నీ ఇమేజినేషనే అంటే నమ్మ లేకుండా ఉన్నాను."

తన కాళ్ల క్రింది భూమి కదిలి పోతున్నట్టుగా అనిపించింది మాధవికి భర్త మాటలు వింటుంటే.

కమల ఆవేశపడిందంటే, బాస్ అపార్థం చేసికొన్నాడంటే, అక్కయ్య ఆపోహ పడిందంటే, అత్తగారు బాధ పడ్డారంటే తను వారిని అర్థం చేసికొని సానుభూతి చూపగలిగింది. కాని యిప్పుడు భర్త యింత దారుణంగా అనుమానిస్తుంటే ఎలా సహించటం? మిగతావాళ్ల సంగతంతా ఒక ఎత్తూ, జీవిత భాగస్వామి అయిన భర్త దొక ఎత్తూను.

ఎలాగైనా భర్తలో నుండి ఆ అనుమాన పిశాచాన్ని పారద్రోలాలనే ఉద్దేశ్యంతో అంది మాధవి.

"అది కాదండీ. అంత చదువుకున్నవారు, అన్నీ తెలిసినవారు మీరే యిలా మాట్లాడితే ఎలాగండి? రచయిత ఒక విషయాన్ని వర్ణించేడంటే అతడు దానిని స్వయంగా అనుభవించే ఉండాలని నియమమేమీ లేదు. మానవ హృదయంలో జనించే ప్రతి అనుభూతినీ తను స్వయంగా అనుభవించి నట్టు వ్రాయటమే రచయితలోని విశేషం. ఈ రకమైన శక్తి రచయితకు పుట్టుకతోనే వస్తుంది. దానికి తోడు తగినంత భాష, ఎక్స్‌ప్రెషన్, కొంత కల్పనాశక్తి కూడా ఉంటే అతను ఉత్తమ రచయితగా చెలామణీ అవుతాడు" అంది.

"నువ్వు చెప్పింది నిజమే కావచ్చు. కాని సమ్‌హౌ ఐ డిస్‌లైకిట్. నువ్వు రచయిత్రివనీ, అలాటి కథలు వ్రాసేవనీ ముందే తెలిసుంటే నిన్ను వివాహమాడటానికి సాహసించి ఉండేవాడిని కానేమో" అన్నాడు.

మాధవి హృదయం అసహ్యంతో, విరక్తితో గడ్డ కట్టుకు పోయింది.

ఇక అతనితో వాదించటం చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లేననుకుని వూరుకుంది.

ఏదేని ఒక విషయాన్ని గురించి తర్కబద్ధంగా చర్చించాలంటే యిరు పక్షాలు ప్రెజుడిస్ లేకుండా, అర్థహీనమూ, సంకుచితమూ అయిన సెంటిమెంట్సుకు తావీయకుండా ఉన్నప్పుడే వాదన రక్తి కడుతుంది.

అందుకే మరేం తర్కించకుండా వూరుకుంది మాధవి. చంద్రశేఖర్ ఆ తరువాత వారంరోజుల వరకు ముభావంగా ఉన్నాడు. తరువాత క్రమంగా ఆ విషయం మర్చిపోయి ఆమెతో మామూలుగానే ప్రవర్తించసాగేడు. గుడ్డిలో మెల్ల—రచనల సంగతి దేవుడెరుగు. కనీసం తన వైవాహిక జీవితమన్నా సుఖంగా జరిగితే అంతే చాలు ననుకుంది, భర్తలో వచ్చిన మార్పును గమనించిన మాధవి.

కాని ఆ రకమైన తృప్తితో ఆమె జీవించలేక పోయింది ఎక్కువకాలం.

అసలు తృప్తి అనేది రచయిత రక్తంలోనే ఉండదు. ఉండకూడదు.

ఒక వ్యక్తి రచనలు చేస్తున్నాడంటే దానికి మిగతా కారణాలెన్ని ఉన్నా అన్నిటికన్నా అతనిలో నిరంతరం సాగుతూండే ఒక రకమైన భావ సంఘర్షణ, ఆత్మద్రోహమే దానికి ముఖ్యకారణాలు. అతనిలో ఉద్భవించే యీ భావవాహినికి అవుట్‌లెట్‌గా అతను రచనలు చెయ్యకపోతే బ్రతకలేడు.


ఈ ఆత్మద్రోహం మాధవిలో తీవ్రంగానే ఉంది. నిల్చున్నా, కూర్చున్నా, ఏ పని చేస్తున్నా ఆమె ఎన్నో విషయాలను గురించి ఆలోచిస్తుంటుంది. చూస్తూండగానే ఆ ఆలోచనలన్నీ వరుసక్రమంతో చేర్చి కథారూపాన్ని దాలుస్తున్నయ్. కాని వాటిని కాగితం మీద పెట్టే ధైర్యం చాలటం లేదామెకు. వివి వ్రాస్తే ఎవరే రకంగా అపార్థం చేసికొంటారో, మళ్లీ ఏం ఉపద్రవ మొస్తుందోనని భయపడింది.

కాని యీ రకంగా ఎక్కువకాలం తనని తను నిగ్రహించుకో లేకపోయింది. దానికి 'ప్రగతి' పత్రిక వారు ప్రకటించిన దీపావళి కథల పోటీ కూడా ఒక కారణం.

చివరకు నాలుగైదురోజులు రాత్రింబవళ్లు కూర్చుని ఓ కథ వ్రాసింది.

భర్త ప్రవర్తన ఆమె హృదయంలో రేపిన ఆవేదన ఆమెను ఆధ్యాత్మికంగా కొన్ని మెట్లు పైకి

(52 వ పేజీ చూడండి)



తీసుకుపోయింది. ఆమె ఆత్మలో కలిగిన యీ ఉన్నతి ఆమె రచనలో కూడా ప్రతి ఫలించింది.

అందులో కథానాయకి సహజంగా భావుకురాలు, అసాధారణమైన మేధావిని కూడా. వివాహాన్ని గూర్చి కన్యగా ఉన్నపుడు ఎన్నో కలలు కంటుంది. తన భర్తనో దైవంగా, అతని తోటి జీవితం స్వర్గ తుల్యంగా భావించుకుంటున్న ఆమె విష గుళికల వంటి జీవిత సత్యాలనెన్నింటినో మింగవలసి వస్తుంది. తన కలల ప్రపంచానికీ, వాస్తవికతకీ గల అంతరాన్ని భరించలేక లౌకిక బంధాలన్నీ తెంచుకుని పిన్నవయస్సులోనే సన్యసిస్తుంది. ఆ కథ పేరు "నవజీవనం."

ఈ రకమైన కథావృత్తాన్ని రసవత్తరంగా చిత్రించటానికి ఆమె శాయశక్తులా ప్రయత్నించి కృతకృత్యురాలయింది. ఆ కథను పోటీకి పంపు తున్నట్లు భర్తకి కూడా చెప్పలేదామె. ఒకవేళ పోటీలో నెగ్గకపోతే చిన్నబోవలసి వస్తుందేమో నని ఆమె భయం.

అదీకాక యీ కథలో భర్త తనని అనుమానించ టానికి వీలైన విషయాలేం లేవు. కాబట్టి అచ్చయిన తరువాత ఆ కథను చూసి అతను ఏమీ అనుకోడనే ధైర్యంతో ఉంది మాధవి.

రెండునెలలు గడచినయ్. ఈ లోపల ఆమె యింకా రచన లేమీ చెయ్యలేదు. పోటీ ఫలితాలు కోసం ఎదురు చూడటంతోనే సరిపోయిందామెకు.

చివరకు ఫలితాలు రానే వచ్చినయ్. ఆమె కథకు ప్రథమ బహుమతి లభించింది.

ఆమె కథను పాఠకులంతా ఎంతో గొప్పగా మెచ్చుకున్నారు. మాధవి ఆనందానికి అవధులు లేవు.

ఫలితం తెలిసినప్పుడు శేఖర్ కాంప్‌లో ఉండటం వలన అతనికీ సంగతి తెలియదు. పదిరోజులైనాక అతనింటికి వచ్చేక మాధవి ఎంతో సంతోషంతో భర్తకు చూపింది కథను.

సాంతం చదివిన శేఖర్ ముఖం వాడిపోయింది. పత్రిక విసిరేసి "నన్నింత డైరెక్టుగా అవమానం చెయ్యటంలో నీ ఉద్దేశ్యం ఏమిటి?" అన్నాడు హీనంగా శేఖర్.

# రచయిత్రి కథ

(15 వ పేజీ తరువాయి)

"మిమ్మల్నా! అవమాన పర్చటమా?" అంది వణికిపోతూ మాధవి.

"అవును. ముమ్మాటికీ నన్నవమాన పర్చటానికే నువ్వా కథ వ్రాసేవు. పెళ్లి కాకముందు పాపం ఏ నలకూబరుడినో, నవమన్మథుడినో వూహించుకు నుంటావు. నాలాటి సామాన్యుడు దొరికేసరికి నీ కలలన్నీ భగ్నమైపోయినయ్. పెళ్లి చూపులనాడు ఆ రెండు కళ్లూ ఏమైపోయినయ్? సరిగ్గా చూసి అన్నివిధాలా నచ్చినవాడినే ఎన్నుకోపోయినావా? పోనీ గతిలేక చేసికొన్నావే అనుకో. నోరు మూసుకుని కూర్చోక పైగా లోకానికి నువ్వేదో బాధపడిపోతు న్నట్లు తెలియబర్చటం కూడా ఎందుకు? ఛీ అసలు వీలాటి దాన్ని పెళ్లాడటం నాదే బుద్ధి తక్కువ. నిన్నని ఏం లాభంలే?" అంటూ అక్కడ నుండి వెళ్లిపోయేడు శేఖర్.

అపరిమితమైన దుఃఖం వల్ల మాధవికి కన్నీరు కూడా రాలేదు.

టేబులు మీద పడి ఉన్న 'ప్రగతి' లోని తన కథ మొదటి పేజీ వంక చూస్తూ నిలబడింది.

గాలికి రెపరెప లాడుతున్న ఆ పత్రిక పేజీలు చూస్తుంటే తన గత జీవిత గ్రంథంలోని పుటలు కొన్ని జ్ఞప్తికి రాసాగినయ్ ఆమెకు.

ఒకప్పుడు హైస్కూల్లో చదివే రోజుల్లో కథలు వ్రాయాలని ఎంతగా ఉబలాటపడింది! కాలేజీ రోజుల్లో తను పంపిన కథలు తిరిగి వచ్చే యని ఎంతగా కుంగిపోయింది! అలాగే మొదటిసారిగా తన కథ అచ్చయినప్పుడు తను పొందిన ఆనందం వర్ణనాతీతం.

ఒకనాడు ఏ ఆత్మసంతృప్తి కోసం, తను రచనా వ్యాసంగాన్ని ప్రారంభించిందో ఆనాటి నుండి తను కోరిన సంతృప్తి ఏమాత్రం లభించకపోగా దానికి వెయ్యి రెట్లు మానసిక వ్యథ ననుభవించింది.

ఇప్పుడు తనకున్నవి రెండే రెండు మార్గాలు. ఒకటి రచనా వ్యాసంగానికి స్వస్తి చెప్పి సామాన్య స్త్రీ లాగా భర్త తోటి సుఖజీవనం సాగించటం, రెండు జీవిత బంధాలన్నీ తెంచుకుని కాల్పనిక జగత్తులో విహరిస్తూ గొప్ప రచయిత్రిగా పేరు ప్రతిష్ఠలు సంపాదించుకోవటం.

ఈ రెంటినీ అనుభవించే అదృష్టం తనకు లేదు. తను యిందులో దేన్ని వదులుకోవాలి? మొదటిదా, రెండవదా?

స్త్రీగా ఒక పురుషుడి భార్యగా రెండవ దాన్నే వదులుకుంటానికి సిద్ధమయిందామె.

మాధవి కదిలింది.

తన కథ అచ్చయిన పత్రికలు, వ్రాసి అచ్చుకు పంపని వ్రాతప్రతులు, సగం వ్రాసి వదిలేసిన రచనలు అన్నీ తీసుకుని అగ్గిపెట్టెతో సహా పెరట్లోకి వెళ్లింది.

తన రచనలన్నీ కుప్పగా పోసి నిప్పంటించింది. ఒక్కొక్క కాగితమే అంటుకోవటం ప్రారంభించి మూడు నిమిషాల్లో పెద్దమంట లేచింది.

ఆమె కళ్ల వెంబడి ధారాపాతంగా కురుస్తోంది కన్నీరు. తన చిన్ననాటి కలలు, పసితనపు ఆశలు అన్నీ రూపుదాల్చిన రచన లింకలేవు. ఇకనుంచి తన హృదయంలో జనించే భావాలన్నీ కూడా హృదయంలోనే పడి మ్రగ్గిపోవలసిందే. అవి బయటకు వచ్చేందుకు వీలులేకుండా జీవితం తన హృదయం చుట్టూ ఒక దట్టమైన యినుప గోడను సృష్టించింది.

పైకెగ బాకుతున్న మంటలను చూస్తూ నిలబడిన మాధవి హృదయం, చేతికందివచ్చిన చెట్టంత కొడుకు మరణిస్తే అతని చితికి నిప్పంటించిన పితృ హృదయంలా పరితపిస్తోంది.

ఏమిటా పొగ వస్తోందని తల్లితో సహా బయటకు వచ్చిన శేఖర్ ఆ దృశ్యం చూస్తూనే నిలబడిపోయేడు.


ఆ మంటలలో పడి భస్మమైపోతున్న వేమిటో అతను వెంటనే గ్రహించేడు.

కాని తన భార్య హృదయంలో రగిలే జ్వాలలో పడి భస్మమైపోతున్న భావాలను అతడేనాటికీ అర్థం చేసికోలేడు.


ఆల్బో-సాంగ్

అన్ని వయసుల వారికీ ఆదర్శక బలవర్ధకం

మీరు అన్నివిధాల ఆరోగ్యంగా వుండాలంటే మీకు ఆల్బో-సాంగ్ అవసరం. వృద్ధులకు, యువకులకు కూడా పటిష్టమైన శరీరాన్ని ఆరోగ్యాన్ని సంపాదించుటకు ప్రత్యేకమైన పదార్థాలు ఆల్బో-సాంగ్‌లో చేర్చబడ్డాయి. ఈ రోజు ప్రతి రోజూకూడా ఆల్బో-సాంగ్ తీసుకోండి. సర్వదా మీరు ఆరోగ్యంగా వుంటారు.




జె. అండ్ జె. డీషేన్
హైదరాబాదు (దక్కన్).